
సాక్షి
తిరుపతి
గురువారం । 16 । జనవరి । 2025



గుట్ట.. కొల్లగొట్టు

పుత్తూరు నడిబొడ్డులోని ఆరేటమ్మ గుట్టను స్థానిక టీడీపీ నేత కబ్జా చేయడంపై పట్టణవాసులు మండిపడుతున్నారు. - 8లో



ఆది దంపతుల ఆహ్వానం

జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరస్వామివారు బుధవారం వైభవంగా కైలాసగిరి ప్రదక్షిణ చేపట్టారు. - 8లో



అట్టహాసంగా ఏటి పండుగ..

నాయుడుపేట పట్టణంలో బుధవారం అట్టహాసంగా ఏటి పండుగ ప్రారంభమైంది. పెద్దసంఖ్యలో జనం హాజరయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

'ఫ్లెమింగో' క్రీడలకు దరఖాస్తులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాల్లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడా పోటీలకు క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాకు చెందిన వారు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు. పురుషుల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, మహిళల విభాగంలో త్రోబాల్, టెన్నీస్ కాయిట్, అండర్–15 బాలురకు సంబంధించి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని వివరించారు. క్రీడాకారులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు పీఈటీ మాస్టర్లు ఎస్.భాస్కర్ 93470 38584, ఎస్.మునస్వామి 99660 81144, ఈ.గోపి 90596 06346 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సౌకర్యవంతంగా విద్యుత్ బస్సులు

- మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ప్రయాణికులు



అలిపిరి డిపోలో చార్జింగ్ పాయింట్లు పరిశీలిస్తున్న జోనల్ చైర్మన్ నాగరాజు

తిరుపతి అర్బన్ : పర్యావరణ హితంగా తిరుపతి నుంచి నడుపుతున్న విద్యుత్ బస్సులు సౌకర్యవంతంగా ఉన్నాయని ప్రయాణికులు తెలిపారు. బుధవారం అలిపిరి బాలాజీ బస్టాండ్‌ను సందర్శించిన ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజుతో పలువురు మాట్లాడుతూ తిరుపతి నుంచి తిరుమలకు సాధారణ బస్సులో రూ.90 చార్జీ ఉందని, విద్యుత్ బస్సులో కేవలం రూ.110 మాత్రమే వసూలు చేస్తున్నారన్నారు. రూ.20 అదనపు చార్జీతో సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి తీసుకువచ్చారని ప్రశంసించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వినూత్న ఆలోచనలతో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జోనల్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే 7,500 విద్యుత్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆయన అలిపిరి డిపోలోని చార్జింగ్ పాయింట్లు పరిశీలించారు. అదనపు పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీటీఓ నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, అలిపిరి డీఎం హరిబాబు, తిరుపతి డీఎం బాలాజీ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో భాగంగా చంద్రగిరి సమీపంలోని ఏ.రంగంపేట పరుష పందేలకు సన్నద్ధమైంది. విశేషంగా అలంకరించిన పశువులతో కనువిందు చేసింది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జల్లికట్టును వీక్షించేందుకు అశేష ప్రజానీకం తరలివచ్చింది. రంకెలేస్తూ దూసుకెళుతున్న కోడెగిత్తలను చూసి ఉత్సాహంతో కేరింతలు కొట్టింది. మిద్దెలు.. మేడలపై చేరి ఔత్సాహికులను ఈలలు.. చప్పట్లతో ప్రోత్సహించింది. ఈ క్రమంలోనే జనం మధ్య నుంచి పరుగులు తీస్తున్న ఎద్దులను నిలువరించేందుకు యువత బరిలో దూకింది. పశువులకు కట్టిన పలకలను చేజిక్కించుకునేందుకు పోటీపడింది. గాయాలు తగులుతున్నా ఏమాత్రం వెరవకుండా లక్ష్యం సాధించి విజయగర్వంతో ఉప్పొంగింది.

అశేష జనవాహిని మధ్య నుంచి పరుగులు తీస్తున్న కోడెగిత్తలు



రంకెలేసిన పౌరుషం

- ఏ.రంగంపేటలో ఉత్సాహంగా పరుష పందేలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు
- అశేష జనవాహిని నడుమ దూసుకెళ్లిన కోడెగిత్తలు
- నిలువరించేందుకు పోటీపడిన యువకులు
- పలువురికి స్వల్ప గాయాలు
- ప్రశాంతంగా పండుగ సంబరాలు

చంద్రగిరి : కనుమ పండుగను పురస్కరించుకుని పాడి సంపదకు బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆత్మీయతను పంచుతూ పశువులను విశేషంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వాటి కొమ్ములకు రంగులు వేసి నల్లటి తాగును నడుముకు కట్టి ముస్తాబు చేశారు. ఆనవాయితీ ప్రకారం చేపట్టే పరుష పందేలకు సన్నద్ధం చేశారు.



ముందుకు దూకుతున్న కోడెగిత్త

ఎడ్ల కొమ్ములకు పలకలను కట్టారు. జిల్లాలోనే ఎడ్ల పందేల (జల్లికట్టు)కు పేరుపొందిన గ్రామం ఏ.రంగంపేట. ఈ క్రమంలో జల్లికట్టును వీక్షించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గ్రామంలోని పశువులను ఒక్కసారిగా వీధిలోకి వదలడంతో యువకులు కేరింతలు కొడుతూ వాటిని నిలువరించేందుకు పోటీపడ్డారు. పశువుల పండుగను మహిళలు సైతం మేడలు, మిద్దెలు ఎక్కి ఆసక్తికరంగా తిలకించారు. పౌరుషంతో పరుగులు తీస్తున్న కోడెగిత్తలను అడ్డుకుని పలకలు దక్కించుకునేందుకు యువకులు ఉత్సాహం చూపారు. ఈ ప్రయత్నంలో పలువురు గాయాలపాలయ్యారు. సుమారు గంటన్నర పాటు ఉల్లాసంగా పరుష పందెం సాగింది. అయితే జల్లికట్టు నిర్వహణ చట్టవిరుద్ధమని చెబుతున్నా, తరతరాల సంప్రదాయాల ముందు చట్టాలు చిన్నబోయాయి. పోలీసులు సైతం అడ్డుకోలేక, ప్రేక్షక పాత్ర పోషించారు. చూసీ చూడనట్టు వ్యవహరించారు.

మంచు మనోజ్ సందడి

ఏ.రంగంపేటలోని జల్లికట్టును సినీ నటుడు మంచు మనోజ్ వీక్షించారు. తన భార్య మౌనిక రెడ్డితో కలసి ఆయన పశువులు పరుగులు తీసే వీధిలోకి చేరుకున్నారు. అభిమానులకు అభివాదం చేస్తూ సుమారు గంట పాటు అక్కడే కాలక్షేపం చేశారు.

పలువురికి గాయాలు

పరుష పందేలను చూసేందుకు వచ్చిన వారిలో కొంత మంది యువకులు పశువులను పట్టుకునేందుకు యత్నించడంతో గాయాలపాలయ్యారు. ఎద్దును నిలువరించే క్రమంలో వాటి కొమ్ములు తగలడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన వారిని 108లో తిరుపతి రుయాకు తరలించారు.



ఎద్దును నిలువరిస్తున్న యువత



అభివాదం చేస్తున్న మంచు మనోజ్ దంపతులు



గిత్తను లొంగదీసేందుకు యత్నిస్తున్న యువకుడు



దక్కించుకున్న పలకతో యువకులు

వైఎస్సార్‌సీపీ శ్రేణుల బాయ్‌కాట్



వైఎస్సార్‌సీపీ పలకతో అభిమానులు

తరతరాలుగా వస్తున్న సంప్రదాయ క్రీడను టీడీపీ నేతలు రాజకీయ వేదికగా మార్చేయడం చర్చనీయాంశమైంది. పరుష పందేల్లో ఎడ్లకు తమ అభిమాన నేతల ఫొటోలు, జెండాలు కట్టడం ఎప్పటి నుంచో వస్తోంది. అయితే ఈ ఏడాది ఏ.రంగంపేట జరిగిన జల్లికట్టులో వైఎస్సార్‌సీపీ జెండాలు, నాయకుల చిత్రాలతో కూడిన ఫొటోలు ఏర్పాటు చేయకూడదంటూ టీడీపీ నేతలు అడ్డు తగిలారు. ఇది మంచి పద్ధతి కాదని, గత ప్రభుత్వ హయాంలోనూ అన్ని పార్టీలు కలసి ఈ వేడుకలను జరుపుకున్నాయంటూ స్థానిక పెద్దలు హితవు పలికినా, వారు పెడచెవిన పెట్టారు. క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఎడ్ల పోటీలను బాయ్‌కాట్ చేశాయి. ఈక్రమంలోనే పోటీలకు పెద్దగా పశువులు రాలేదు. కేవలం గంటన్నరలోనే పందేలు ముగిశాయి. ప్రజలు సైతం నిరాశగా వెనుదిరగడం కనిపించింది.

చంద్రగిరి టీడీపీ నేతలపై
సీఎం అసహనం

- ఎమ్మెల్యే నానిని పొగడడంపై చురకలు
- ఇక్కడి ఎమ్మెల్యే ఎలా పనిచేస్తున్నాడో చూస్తున్నా..
- త్వరలోనే అన్నీ రివ్యూ చేస్తా
- మాటల్లో కాదు.. పనితనం చూపించి ప్రజల్లో ఉండండి
- మీరే ముఖ్యమంత్రి అనుకుని పెత్తనం చేస్తే సహించం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి టీడీపీ నాయకులపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై మాట్లాడుతుంటే ఎమ్మెల్యే నానిని స్థానిక నాయకుడు పొగడడంపై చురకలంటించడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడు నారావారిపల్లిలో గ్రామస్తులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం భవిష్యత్తు కార్యాచరణ, స్థానిక సమస్యలు, అభివృద్ధిపై మాట్లాడారు. అనంతరం స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో పార్టీకి చెందిన స్థానిక నాయకుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ఎమ్మెల్యే నానిని పొగుడుతూ మాట్లాడాడు. దీంతో సీఎం చంద్రబాబు కల్పించుకుంటూ.. ''నేను కష్టపడి పని చేస్తున్నా, లబ్ధిదారులకు నేరుగా ఫోన్‌చేసి అభిప్రాయాలు తీసుకుంటున్నాను. ఇవన్నీ నేను చేస్తుంటే మీరు ఎమ్మెల్యేని పొగడక్కర్లేదు.. మిమిల్ని



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎమ్మెల్యే పొగడక్కర్లేదు'' అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. ''నేను పనులు బాగా చేస్తుంటే మీరు ప్రజల్లోకి వెళ్లడం లేదు. నేను ముఖ్యమంత్రి అవతానే.. మీరు కూడా ముఖ్యమంత్రులు అయిపోయినట్లు పెత్తనం చేస్తే మాత్రం ప్రజలందరూ వ్యతిరేకం అవుతారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలి'' అంటూ హెచ్చరించారు. మీడియా సమావేశంలో సైతం సీఎం చంద్రబాబు నాని పనితీరుపై ఓ రకంగా అసహనం వ్యక్తం చేశారు. ''ఇక్కడ ఎమ్మెల్యే ఉన్నాడు.. ఏమేరకు పని చేస్తున్నాడో నేను చూస్తున్నాను. నేను ఒక ప్రోగ్రాం ఇచ్చిన తర్వాత ఎవరెవరు ఎట్లా చేశారో అన్ని బేరీజు చేస్తాను. మూడు పార్టీలు కలిస్తేనే మనం గెలిచామన్నది మర్చిపోవద్దు'' అంటూ హితువు పలికారు.

చర్చనీయాంశంగా మారిన సీఎం వ్యాఖ్యలు

సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే నానిపై మాట్లాడిన మాటలు పార్టీలో విస్తృతంగా చర్చకు దారితీశాయి. ఎమ్మెల్యే నాని ఎన్నిక నాటి నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, చంద్రగిరిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే నాని గెలిచిన నాటి నుంచి చంద్రగిరిలో అవినీతి, ఉద్యోగస్తుల బదిలీల్లో చేతివాటం, దౌర్జన్యాలు, దాడులు, కబ్జాలు, అక్రమ వసూళ్ల పర్వాన్ని ఎప్పటికప్పుడు సీఎంకార్యాలయానికి ఫిర్యాదులు వెళ్తున్నట్లు సమాచారం. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వచ్చిన కథనాలపై కూడా చంద్రగిరికి చెందిన టీడీపీలోని ఒక బలమైన వర్గం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తున్నట్లు కూడా ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సీఎం మాట్లాడే సమయంలో, ఎమ్మెల్యే నానిని సుబ్రమణ్యం నాయుడు పొగడడంతో ఆయన అసహనం వ్యక్తం చేయడంపై ఆ పార్టీ నాయకులే గుసగుసలాడుకోవడం చర్చకు దారితీసింది. 30 ఏళ్ల తర్వాత చంద్రగిరిలో టీడీపీ గెలిస్తే, ఇప్పుడు ఆరు నెలల్లోనూ టీడీపీ క్రెడిబిలిటీని నాని, అతని కుటుంబం నాశనం చేస్తోందంటూ ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. కుటుంబ పెత్తనంతో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్యం దుకాణాలు మొదలు ఇసుక, గ్రావెల్, భూ కబ్జాల్లో వాటాలు వంటి వాటిపై సీఎం చంద్రబాబు నాయుడుకు చంద్రగిరి టీడీపీలోని ఓ బలమైన వర్గం ఎప్పటికప్పుడు పెద్ద మొత్తంలో ఫిర్యాదులు చేసినట్లుగా కూడా ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఎమ్మెల్యే నాని వైఖరి సాక్షాత్తు సీఎం చంద్రబాబు బహిరంగంగా చెప్పడంతో టీడీపీ శ్రేణులు కూడా ఔను నిజమే కాదా.. అంటూ చెవులు కొరుక్కోవడం కొసమెరుపు. ఇలాంటి నేత కారణంగా భవిష్యత్తులో మనకు ముప్పు ఉండడంలో ఎటువంటి సందేహం లేదంటూ టీడీపీ నేతలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరిస్తాం



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య సమస్యలు, సకాలంలో వైద్య సిబ్బంది రాకపోవడంపై ఈ నెల 13వ తేదీన 'పారిశుద్ధ్యం అస్తవ్యస్తం', 14న 'పండగపూట వైద్యం కరువు' శీర్షికలతో సాక్షిలో ప్రచురితమైన కథనాలపై అధికారులు స్పందించారు. బుధవారం ఈ మేరకు డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేయడంతో డీపీఎంఓ డాక్టర్ బి. శ్రీనివాసరావు, సూళ్లూరుపేట రీజియన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పీహెచ్‌సీలో సమస్యలను డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

చిరుత పట్టివేతకు బోన్లు ఏర్పాటు చేయరా..?

తిరుపతి సిటీ: ఎస్వీయూ, వేదిక్ వర్సిటీ పరిధిలో చిరుత సంచరిస్తున్నట్లు సీసీ ఫుటేజీలో స్పష్టంగా కన్పించినా అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని, ఇకనైనా చిరుత పట్టివేతకు బోన్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, వైఎస్సార్‌సీపీ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చిరుత సంచరిస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారని, అటవీ అధికారులు మాత్రం మొక్కుబడిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

అను'మీనం'?

- చెరువులకు చేప పిల్లలు చేరేనా?
- అదిగో.. ఇదిగో అంటున్న అధికారులు!

తిరుపతి అర్బన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సెప్టెంబర్‌లో కోటి చేప పిల్లలను జిల్లాకు తెప్పించేవారు. తిరుపతిలోని మత్స్యశాఖ కార్యాలయంలో రెండు నెలలపాటు పెంచేవారు. వీటిని జాలర్లు దగ్గరుండి పర్యవేక్షించేవారు. కొంచెం సైజ్ పెరిగాక నవంబర్‌లో జిల్లావ్యాప్తంగా ఇరిగేషన్, పంచాయతీరాజ్ పరిధిలోని దాదాపు 350 చెరువుల్లో చేప పిల్లలను వదిలి పెట్టేవారు. ఆయా చెరువుల్లో చేపల వేటను వేలం వేయించేవారు. ఈక్రమంలో మార్చి మొదటి వారం నుంచి ఏప్రిల్ వరకు అయా చెరువుల్లో వేలంపాటదార్లు చేపలు పట్టేవారు. వాటిని విక్రయించడం ద్వారా మంచి లాభాలు వచ్చేవి. సదరు ఆదాయంలో 20శాతం మత్స్యశాఖకు, 30శాతం పంచాయతీలకు, 50శాతం చెరువుల అభివృద్ధికి వినియోగించేవారు. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. వర్షాలైతే సకాలంలో కురవడంతో చెరువులు అన్ని నిండాయి. అయితే చేపపిల్లలను మత్స్యశాఖ అధికారులు తెప్పించలేదు. దీనిపై గత ఏడాది డిసెంబర్ తొలివారంలో ప్రశ్నిస్తే ఒకేసారి తెనాలి నుంచి చేపపిల్లలను తీసుకువచ్చి ఆ నెల 31తేదీ నాటికి చెరువుల్లో నేరుగా వదలిపెట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పుడేమో జనవరి 31 తేదీకి చేపపిల్లలను వదులుతామని చెబుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదాలు వేశారు. మళ్లీ ఫిబ్రవరిలో అంటే సీజన్ పూర్తి అయినట్లే అని జాలర్లు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా చేపపిల్లలు వదిలిపెట్టిన తర్వాత కనీసం 100 రోజులపాటు చెరువులో ఉంటేనే అవి మంచి సైజ్ వస్తాయని, దీంతో రాబడి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. మార్చి మొదటి వారం నుంచే చేపపిల్లలను పట్టాల్సి ఉంది. దీంతో 50 నుంచి 60 రోజుల్లోనే చేప పిల్లలను పడితే దిగుబడి రాదంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం తమకు మత్స్యకార భరోసా మంజూరు చేయలేదని, తాజాగీ చేప పిల్లలను వదలిపెట్టకుండా జీవనోపాధికి గండికొడుతోందని వాపోతున్నారు.



తిరుపతి జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో చేపపిల్లలు వదిలిపెట్టిన తొట్టిలు (ఫైల్)

నెలాఖరుకు అవకాశం



చేపపిల్లలు ఈ నెలాఖరుకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాం. టెండర్లు పూర్తి చేశాం. టెండర్లు దక్కించుకున్న వారు జిల్లాల వారీగా చేపపిల్లలను ఇవ్వాల్సి ఉంది. దానికోసమే ఎదురుచూస్తున్నాం. వచ్చిన వెంటనే చెరువుల్లో వదిలిపెడతాం.

– నాగరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ప్రత్యేక బస్సు

తిరుపతి అర్బన్ : ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీ పర్యాటక సంస్థ డివిజన్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఉదయం 8 గంటలకు తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం నుంచి ఓ సర్వీస్ నడపనున్నట్లు వెల్లడించారు. తిరిగి సాయంత్రం 7 గంటలకు తిరుపతికి బస్సు చేరుకుంటుందని చెప్పారు. ఈ బస్సులో నేలపట్టు, అటకాని తిప్ప, సూళ్లూరుపేట, శ్రీసిటీ, బీవీపాళెంలో పర్యటించవచ్చని వివరించారు. రూ.500 టికెట్ చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 0877–2289123, 9848007033 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.81,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,350

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.92,100
రిటైల్ వెండి గ్రాము	రూ.95.10

క్లుప్తంగా

ఫార్మసీ డిప్లొమా కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ డిప్లొమా కోర్సులో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనిట్టు కళాశాల ప్రతినిధి డాక్టర్ ఎం.పద్మావతమ్మ తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 21వ తేదీలోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 92990 08151, 92475 75386, 89789 93810 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

21వ తేదీకి యూజీసీ నెట్ పరీక్ష వాయిదా

తిరుపతి సిటీ : యూజీసీ నెట్–2025 పరీక్షను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేస్తూ ఎన్‌టీఏ ప్రకటన విడుదల చేసింది. బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షను సంక్రాంతి పండుగ నేపథ్యంలో అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా ఈనెల 21, 27 తేదీల్లో నిర్వహిస్తూ రీషెడ్యూల్ తేదీలను ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా నెట్–2025 పరీక్షకు సుమారు 627 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలో ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి రోడ్డు పక్కన పడి మృతి చెందినట్లు సీఐ జయచంద్ర తెలిపారు. నెల్లూరు పట్టణం వైకుంఠపురానికి చెందిన పామంజి మునెయ్య((48) తిరుపతి మంగళంలోని తన కుమారుడు మునిరాజా వద్దకు సంక్రాంతి సందర్భంగా వచ్చి, మంగళవారం రాత్రి నెల్లూరుకు తిరిగి బయల్దేరాడు. మేర్లపాక దళితవాడ సమీపంలోని ఓ గుడి వద్ద మద్యం తాగి మైకంలో కింద పడిపోయాడు. తలకు కుడివైపున రక్తపు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

తిరుపతి క్రైం : తిరుపతి స్కావెంజర్స్ కాలనీలో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. బాధితుడిని రుయా ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. కాలనీకి చెందిన చీరాలయ్య అలియాస్ స్పైడర్ అదే కాలనీకి చెందిన సోముతో వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన సోము కత్తితో దాడికి దిగాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

గుట్ట.. కొల్లగొట్టు

కబ్జాకు కాదేదీ అనర్హమన్నట్లు కూటమి నేతలు గుట్టలను సైతం కొల్లగొడుతున్నారు. అధికారంలో ఉన్నాం.. అడిగే వారు లేరు.. అడ్డురాలేరు.. కనిపించిందంతా కొల్లగొట్టేద్దాం అని గుట్టను సైతం చదును చేసి ఆక్రమించేస్తున్నారు. గుట్టను చదును చేసే క్రమంలో వచ్చే బండరాళ్లు.. మట్టిని సైతం చెరువులో కుమ్మరిస్తూ నీటి వనరునూ పూడ్చేస్తున్నారు. ఇదీ పుత్తూరు నడిబొడ్డున ఆరేటమ్మ గుడి వద్ద ఉన్న గుట్ట కబ్జా కథ.


ఆరేటమ్మ గుట్టను తొలిచేస్తున్న ఇటాచీ యంత్రం

దర్జాగా భూ కబ్జా!

- పుత్తూరు పట్టణ నడిబొడ్డున ఆక్రమణ పర్వం
- కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం
- రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం స్వాహాకు యత్నం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

పుత్తూరు: పట్టణ నడిబొడ్డున గల ఆరేటమ్మ గుట్టను స్థానిక తెలుగుదేశం పార్టీ నేత ఒకరు కాజేస్తున్నారు. పట్టపగలు ఇటాచీల సాయంతో కొండను తొలిచేస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పుత్తూరు రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 100లో ఆరేటమ్మ గుట్ట ఉంది. ఈ గుంటకు తూర్పు దిశగా ఆర్టీసీ కాలనీ, దక్షిణం వైపుగా బీసీ కాలనీలు ఉన్నాయి. పడమర వైపు కొన్ని నివాసాలు ఉన్నాయి. ఉత్తరం వైపుగా పుత్తూరు–చిత్తూరు రహదారికి ఆనుకుని ప్రభుత్వ పాఠశాలతోపాటు కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ నివాసాల మధ్య కొద్ది రోజులుగా యంత్రాల సాయంతో పెద్ద ఎత్తున చదును చేస్తున్నారు. ఇక్కడి నుంచి సేకరించిన మట్టిని, బండరాళ్లను సమీపంలోని పుత్తూరు చెరువులోకి తరలిస్తుండడంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అడిగే వారే లేరా? అని ఆక్రోశిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

పుత్తూరు పట్టణంలో జరుగుతున్న కబ్జాలపై విపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నాయకులు అధికార గర్వంతో భూ కబ్జాలకు పాల్పడడం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు. అధికారులు దీనిపై వెంటనే విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కూటమి రాకతో ఆక్రమణలు


పుత్తూరు ఆరేటమ్మ గుట్టను చదును చేస్తున్న ఇటాచీ యంత్రం

గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలకు, ఆక్రమణలు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. అదే సమయంలో పుత్తూరు పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. దీంతో పట్టణంలోని భూములు, ఇళ్ల స్థలాల విలువ ఘణనీయంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు దౌర్జన్యాలు, అవినీతి అక్రమాలకు మళ్లీ తెరతీశారు. పట్టణంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తమకు అడ్డు చెప్పేదెవరన్న ధీమాతో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు.

పండగ సెలవుల్లో మొదలైనట్టుంది



సంక్రాంతి పెద్ద పండుగ సెలవుల నేపథ్యంలో ఈ ఆక్రమణలకు పాల్పడినట్లున్నారు. ఆరేటమ్మ గుట్ట వద్ద భూకబ్జా విషయం తన దృష్టికి ఇప్పటి వరకు రాలేదు. వెంటనే సిబ్బందిని పంపి, ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తాం. విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకొంటాం.

– జీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

21న చిత్తూరులో రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటన



మాట్లాడుతున్న నరేంద్రబాబు మాదిగ

తిరుపతి కల్చరల్ : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ 21న చిత్తూరుకు వస్తున్నారని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మాదిగలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వినతులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత ఎస్.నరేంద్రబాబు మాదిగ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు తమ ఇష్టానుసారం అమలుచేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21న ఏకసభ్య కమిషన్ చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మాదిగల సంక్షేమాన్ని కాంక్షించే వారు వినతులు అందజేయాలని కోరారు. గోపి మాదిగ, రామకృష్ణ, కారుమంచి మధు, రాజేంద్ర మాదిగ, వాసుదేవరాజ మాదిగ, బాలాజీ, వాసు,శివయ్య, ధనుంజయ మాదిగ పాల్గొన్నారు.

పండుగ పూట పలు కుటుంబాల్లో విషాదం

– వేర్వేరు ప్రమాదాల్లో ఐదు ప్రాణాలు బలి

తిరుపతి క్రైమ్/చంద్రగిరి/సూళ్లూరుపేట రూరల్/పాకాల/డక్కిలి: సంక్రాంతి పండుగ సంబరాలను తీసుకవస్తే.. కొన్ని కుటుంబాల్లో మాత్రం విషాదం నింపింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఇద్దరు బాలురు, ఓ యువతి, ఇద్దరు వ్యక్తులు ఉన్నారు.

స్నేహితుడిని కాపాడబోయి..


శరణ్ కిషోర్ మృతదేహం

డక్కిలి పంచాయతీ నరసనాయుడుపల్లె దళితవాడకు చెందిన దాసరి రవి, పార్వతి దంపతుల రెండో కుమారుడు శరణ్ కిషోర్ (14 తన స్నేహితుడు విశాల్‌తో కలిసి మంగళవారం కండలేరు–పూండి తెలుగుగంగ కాలువ దగ్గరకు వెళ్లాడు. ఇంతలో విశాల్ ప్రమాదవశాత్తు గంగ కాలువలో పడి పోయాడు. మిత్రుడిని కాపాడేందుకు కాలువలోకి దిగిన కిషోర్ కూడా మునిగిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి ఇద్దరిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ కిషోర్ మృతి చెందాడు. ఎస్ఐ శివ శంకర్ ఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని రాపూరు ప్రభుత్వ ఆస్పత్రిఇ తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

సూళ్లూరుపేట మండలంల పెరిమిటి పాడు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. వివరాలు.. తడ మండలం మాంబట్టుకు చెందిన వాటంబేడు మునిరాజా, సూళ్లూరుకు చెందిన పరంధామయ్య బైక్ పై వెళుతుండగా అదుపు తప్పి పడిపోయారు. మునిరాజా అక్కడికక్కడే మరణించాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

విద్యుదాఘాతంతో..


మృతి చెందిన హరికృష్ణారెడ్డి

పాకాల మండలం దామలచెరువు పంచాయతీ యల్లంపల్లిలో డి.హరికృష్ణా రెడ్డి అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు..బుధవారం తన సొంత మామిడి తోటలో ట్రాక్టర్‌తో దున్నకాలు చేస్తుండగా విద్యుత్ తీగలపై ఉన్న కొబ్బరి మట్టను తొలగించేందుకు యత్నించగా ప్రమాదం జరిగింది.

భవనంపై నుంచి పడి..

తిరుపతి పెద్దకాపువీధిలో ఓ యువతి ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మృతి చెందింది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. పసుపులేటి మురళి, జ్యోతి దంపతుల కుమార్తె కీర్తి (20) గతేడాది డిగ్రీ పూర్తి చేసింది. ఆమెను సమీప బంధువుకు ఇచ్చి పెళ్లి చేసేందుకు నిశ్చితార్థం కూడా జరిగింది. ఫిబ్రవరిలో వివాహం జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించుకున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇంటి మిద్దెపైన ఆరబెట్టిన దుస్తులు తీసుకుంటూ అదుపుతప్పి భవనం పైనుంచి కిందకు పడింది. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఊయలే..ఉరి తాడై..


మృతి చెందిన సమీర్

చంద్రగిరి బీడీ కాలనీ ఓ బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వివరాలు.. షాహిదా అనే మహిళ భర్త వదిలేయడంతో తన కుమారుడు సమీర్(11)తో కలసి ఒంటరిగా జీవిస్తోంది. బతుకుదెరువు కోసం ఆమె ముంబాయికి వెళ్తూ సమీర్‌ను తన సోదరుడి వరసైన షబ్బీర్ వద్ద విడిచి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సమీర్ ఇంట్లో ఎవరు లేని సమయంలో తాడుతో ఊయల కట్టుకుని ఆడుకుంటున్నాడు. ఇంతలో ఊయల తాడు ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకుంది. దీంతో ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత ఇంటికి వచ్చిన షబ్బీర్ వెంటనే సమీర్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అది నేనే.. ఇది నేనే..!

- ప్రకృతి వ్యవసాయం నేనే ప్రారంభించా
- ప్రతి ఇంట్లో విద్యుత్ ఉత్పత్తి చేయిస్తా
- నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి రూరల్/చంద్రగిరి : దేశంలోనే కాదు ప్రపంచంలోనే ప్రకృతి వ్యవసాయాన్ని తానే ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళవారం నారావారిపల్లె పర్యటనలో భాగంగా గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. స్వర్ణ నారావారిపల్లె విజన్ తీసుకువస్తున్నామని వెల్లడించారు. అన్నీ నేనే చేశా.. అన్నీ నేనే చేస్తానంటూ హామీలు గుప్పించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఏమన్నారంటే..

- ప్రకృతి సేద్యం గురించి ఇప్పుడు మాట్లాడుకుంటున్నారు. అప్పట్లోనే కుప్పంలో నేనే ప్రారంభించా.
- నారావారిపల్లె పరిధిలోని ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్‌కు సూచించా.
- శ్రీసిటీ సౌజన్యంతో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు సౌకర్యాలు, ఏఐ టెక్నాలజీ ల్యాబ్ ఏర్పాటు చేస్తాం.
- ఫిబ్రవరి లోపు వందశాతం మరుగుదొడ్లు నిర్మిస్తాం.
- జల్ జీవన్ మిషన్ కింద రక్షిత మంచినీరు నిరంతరం అందిస్తాం.
- ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయిస్తాం.
- రంగంపేట నుంచి భీమవరం, మంగళం పేట వరకు రూ.8కోట్లతో రోడ్లు నిర్మిస్తాం.
- ప్రతి వీధికీ సీసీ రోడ్డు ఉండేలా చర్యలు చేపడతాం.
- విద్యార్థులు, గృహిణులు చదువుకునేందుకు, పని చేసేందుకు ఐటీ టవర్ నిర్మిస్తాం.
- కల్యాణీ డ్యామ్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని సీఎం వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు.

డాక్టర్ అవతారమెత్తి.. చైన్ కొట్టేసి!


నిందితురాలు

తిరుపతి తుడా : పేద రోగులే టార్గెట్‌గా రుయాలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు... రోగుల సహాయకులుగా తరచూ పేషంట్ వార్డుల్లో తిరుగుతూ సెల్‌ఫోన్లు, పర్సులు దొంగతనం చేసే ముఠా ఇప్పుడు కొత్త అవతారం ఎత్తింది. ఏకంగా తెల్ల కోటు ధరించి డాక్టర్ వేషం ధరించి చోరీలకు పాల్పడడం కలకలం రేపుతోంది. రుయా ఆస్పత్రిలో తరచూ మొబైల్ ఫోన్లు, పర్సులు, ఏటీఎం కార్డులు, బైక్ దొంగతనాలు జరగడం సర్వసాధారణమైంది . ఈ క్రమంలోనే తెల్ల కోటుతో వచ్చి రోగులను బురిడీ కొట్టించి ఐదు సవర్ల బంగారు చైను చోరీ చేసిన యువతిని సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం రుయాలో చోటుచేసుకుంది... వైఎస్సార్ జిల్లా వల్లూరుకు చెందిన శ్రీవాణి అనే యువతి అనస్తీషియా టెక్నీషియన్ అని రోగులకు చెప్పుకుంటూ అత్యవసర విభాగంలో తిరుగుతూ ఉండేది. ఈ క్రమంలో అప్పుడే రేణిగుంట నుంచి గాయాలతో వైద్యం కోసం వచ్చిన వెస్లీ అనే మహిళను గుర్తించి పరిచయం చేసుకుంది. అనంతరం స్కానింగ్ కోసం తీసుకెళ్లి ఒంటిపై నగలు తీసేయాలని సూచించింది. వెస్లీ తన ఒంటిపై ఉన్న రెండు బంగారు చైన్లు, రెండు బంగారు గాజులను తీసి ఆ యువతి చేతికి ఇచ్చి బయట తన భర్తకు ఇవ్వాలని చెప్పింది. అయితే శ్రీవాణి చేతివాటం ప్రదర్శించి ఐదు సవర్ల బంగారు గొలుసును తన బ్యాగులో వేసుకొని మిగిలిన వస్తువులను వెస్లీ భర్త చేతికి ఇచ్చింది. ఇందులో మరో చైన్ ఉండాలని వెస్లీ భర్త విక్టరీ అడగడంతో మాకేం తెలుసు అంటూ ఆ యువతి అక్కడినుంచి వెళ్లిపోయింది. స్కానింగ్ నుంచి బయటికి వచ్చిన వెస్లీ నగలు చూసి అందులో ఒక చైన్ లేకపోవడాన్ని గుర్తించి వెంటనే సెక్యూరిటీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లింది. సెక్యూరిటీ వెంటనే అప్రమత్తమై గాలింపు చేపట్టారు. అక్కడే ఉన్న యువతిని గుర్తించి ఆమె బ్యాగులో బంగారు చైన్‌ను గుర్తించారు. వెస్ట్ పోలీసులకు యువతిని అప్పగించారు.

మటన్ డబ్బు అడిగారని..


చికిత్స పొందుతున్న కేశవులు

తిరుపతి రూరల్ : మటన్ తీసుకెళ్లి మూడు నెలలైనా డబ్బులు ఇవ్వకపోవడంతో అడిగేందుకు వెళ్లిన దంపతులపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి మల్లంగుంటలో జరిగింది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. మల్లంగుంట పంచాయతీ వినాయకనగర్‌కు చెందిన కేశవులు, హేమలత దంపతులు మటన్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. మూడు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన వినాయక అనే వ్యక్తి మటన్ తీసుకెళ్లి రూ.1200 అప్పు పెట్టాడు. ఈ క్రమంలో కేశవులు, హేమలత దంపతులు సోమవారం రాత్రి వినాయక ఇంటికి వెళ్లి డబ్బులు అడగడంతో ఆగ్రహించిన వినాయక కుమారులు ప్రదీప్, సందీప్, మరో వ్యక్తి కలిసి ఇనుపరాడ్‌తో దాడి చేశారు. హేమలత మెడలోని 32 గ్రాముల బంగారు చైన్ లాక్కున్నారు. రక్తగాయాలతో పడి ఉన్న బాధితులు స్థానికులు చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. మంగళవారం బాధితుడు కేశవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

అట్టహాసంగా ఏటి పండుగ ఆరంభం


ఏటి పండుగకు స్వర్ణముఖి నదీ తీరానికి హాజరైన జనాలు

– జనసంద్రంగా స్వర్ణముఖి నదీ తీరం


సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారుల నృత్యం

నాయుడుపేట టౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ నాడు నిర్వహించే ఏటి పండుగ వేడుకలు బుధవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా స్థానిక నాయకులతో కలిసి ఉత్సవాలను ప్రారంభించారు. తొలి రోజు పెద్దసంఖ్యలో ప్రజలు స్వర్ణముఖి నదీ తీరానికి తరలివచ్చారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు మట్టితో చేసిన గొబ్బెమ్మల ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నదిలో నిమజ్జనం చేశారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. గురు, శుక్రవారాల్లో మరింత పెద్దసంఖ్యలో జనం తరలివచ్చే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.


గొబ్బెమ్మలను తీసుకొస్తున్న మహిళలు

కారును ఢీకొన్న బైక్ : ఇద్దరికి గాయాలు

తిరుపతి రూరల్: సి.మల్లవరం సర్కిల్ వద్ద కారును బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. చంద్రగిరి మండలం కల్‌రోడ్‌పల్లెకు చెందిన సుదీప్, కల్లూరు గ్రామానికి చెందిన హేమంత్ శ్రీకాళహస్తిలో ఉంటున్నారు. ఫ్రెండ్ బర్త్‌డే కావడంతో బుధవారం ఉదయం చంద్రగిరికి వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో బైక్‌పై వెళుతూ కారును వేగంగా ఢీకొట్టారు. సమాచారం అందుకున్న సీఐ చిన్నగోవిందు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో తన పోలీసు వాహనంలోనే వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తండ్రి ఆచూకీ తనయుడి ఆక్రోశం

పెళ్లకూరు : పోలీసులు ఎలాంటి కేసు లేకుండా తన తండ్రిని తీసుకెళ్లారని, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఆచూకీ చెప్పడం లేదని ఓ తనయుడు ఆక్రోశం వెలిబుచ్చాడు. పెళ్లకూరు మండలం చిల్లకూరు దళితవాడకు చెందిన మెరియం గంగారామ్ మానాన్న (మెరియం ప్రసాద్) ఆచూకీ చెప్పండి అంటూ బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులను విజ్ఞప్తి చేశాడు. ఎలాంటి ఫిర్యాదు లేకుండా, ఏవిధమైన కేసు నమోదు చేయకుండా స్థానిక ఎస్ఐ నాగరాజు మానాన్నని జీపులో ఎక్కించుకొని వెళ్లాడని ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పటి నుండి నాయుడుపేట, పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నా ఏమీ చెప్పడం లేదని వాపోయాడు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు కావడం వల్లే తన తండ్రిని అక్రమంగా తీసుకెళ్లినట్లు ఆరోపించాడు.

ఆది దంపతుల ఆహ్వానం

- వేడుకగా కైలాసగిరి ప్రదక్షిణ
- వైభవంగా ఎదురు సేవ


ఉత్సవంలో ఎమ్మెల్యే, ఈఓ తదితరులు


పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదిదంపతులు ఏటా కనుమ పండుగ రోజు కైలాసగిరి ప్రదక్షిణచేసి దేవతలు, రుషులను ఆహ్వానిస్తారు. ఈ సందర్భంగా జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఉత్సవమూర్తులను చప్పరాలపై అధిష్టింపజేసి కైలాసగిరి ప్రదక్షిణకు బయలుదేరారు. భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లు అశేష భక్తులతో కలిసి జయరామరావువీధి, కైలాసగిరికాలనీ, రామచంద్రాపురం, రాజీవ్‌నగర్ మీదుగా రామాపురం రిజర్వాయరు సమీపంలోని అంజూరు మండపం వద్దకు చేరుకున్నారు. విశేష పూజల అనంతరం బయలుదేరి వేయిలింగాలకోన, వేడాం మీదుగా శుకబ్రహ్మాశ్రమం వద్ద ఎదురుసేవ మండపానికి వేంచేపు చేశారు.

'ఎదురుసేవ' సంబరం

గిరిప్రదక్షిణ ముగించుకుని వచ్చిన స్వామి అమ్మవార్లకు శుకబ్రహ్మాశ్రమం సమీపంలో ఎదురు సేవ మండపం వద్ద భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామి అమ్మవారుల కొద్దిసేపు ఎదురుసేవ మండపంలో సేద తీరారు. అనంతరం ఆలయానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.